హైడ్రాపై ఆర్డినెన్స్!

- నేడు క్యాబినెట్ భేటీ
- ఎజెండాలో హైడ్రా, ఆర్వోఆర్ చట్టం, పంట నష్టపరిహారం
- రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీకి మార్గదర్శకాలపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి శుక్రవారం సమావేశం కానున్నది. సచివాలయంలో జరగనున్న క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం. ఇటీవల భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయంపై చర్చించి, ఆమోదించే అవకాశం ఉన్నది. చెరువులు, నీటి వనరుల పరిరక్షణకు ఉద్దేశించిన 'హైడ్రా'ను మరింత బలోపేతం చేయడంపై చర్చించి, ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలుపనున్నట్టు సమాచారం. కొత్త ఆర్వోఆర్ చట్టంపై కూడా మంత్రివర్గం చర్చించి, నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. ఇటీవలే ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తికాగా, వాటిని క్రోడీకరిస్తూ అధికారులు కొత్త ఆర్వోఆర్ చట్టానికి తుదిరూపు ఇచ్చారు. దీనిపై చర్చించి, ఆర్డినెన్స్ జారీ చేయాలా? అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలా? అనే అంశంపై మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇటీవల నియమించిన వ్యవసాయ, విద్యా కమిషన్లకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉన్నది. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల జారీకి రూపొందించిన మార్గదర్శకాలపై చర్చించనున్నట్టు తెలిసింది. దీంతోపాటు రాష్ట్రంలో వయసు, అర్హతతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యబీమా ఇచ్చే అంశంపై చర్చించనున్నట్టు సమాచారం. కొత్తగా దాదాపు 200 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ఆమోదం తెలుపనున్నట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. యానివర్సిటీలకు కొత్త పేర్లకు ఆమోదం తెలుపనున్నది. వీర నారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ పేర్లకు ఆమోదం తెలుపనున్నది.

జనం లేని సదస్సుకు పది కోట్లా?

- ఏఐ సదస్సు పేరిట కాంగ్రెస్ నిధుల వరద
- పెద్ద స్కాం ఉన్నట్టు సర్కార్‌పై ఆరోపణలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ వేదికగా సెప్టెంబర్ 5-6 తేదీల్లో నిర్వహించిన ఏఐ సదస్సుకు రూ.10 కోట్లు విడుదల చేయగా, జనాలు, ప్రతినిధులేని సదస్సుకు ఇంతమొత్తంలో ఎలా ఖర్చు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కాన్ఫరెన్స్ పేరిట కోట్లు పక్కదారి పట్టించిందనే ఆరోపణలు జోరందుకుంటున్నాయి. హైదరాబాద్ వేదికగా గతంలో ఎన్నో అంతర్జాతీయ సదస్సులు జరిగినా ఈ స్థాయిలో ఖర్చు జరగలేదని.. ఇదో స్కాంలా ఉన్నదని ఐటీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ద్వారా రూ.9.5 కోట్లు విడుదల చేయగా, దీనికి అదనంగా స్పాన్సర్లు ఇచ్చే సొమ్ము కలుపుకుంటే రూ.పది కోట్లపైనే ఉంటుందని, ఇదంతా ఖర్చు చేశారా? ఆ పేరిట స్వాహా చేశారా? అన్న చర్చ జరుగుతున్నది. ఈ సదస్సుతో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి రాలేదని పేర్కొంటున్నారు.

అవయవాల దానంతో 'విశాల' ఆదర్శం

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 19: కౌతా అన్నపూర్ణ విశాలాక్షి (62) బ్రెయిన్ స్ట్రోక్‌తో దవాఖానలో చేరి.. ఈ నెల 16న కన్నుమూశారు. కిడ్నీలు, లివర్ దానం చేసి ఆదర్శంగా నిలిచారు. కౌతా శ్రీనివాస్, అన్నపూర్ణ విశాలాక్షి ఆదర్శ దంపతులు. రెండున్నర దశాబ్దాలుగా రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంలో నివసిస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో విశాలాక్షికి బీపీ పెరిగిపోయి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. బంధువుల సాయంతో ఆమెను ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. భర్త శ్రీనివాస్ అంగీకారంతో విశాలాక్షి కిడ్నీలు, లివర్‌ను జీవన్‌దాన్‌కు అందజేశారు. విశాలాక్షి మరణించినా.. అవయవాల దానంతో ఆమె ఎప్పటికీ బతికే ఉంటుందని భర్త పేర్కొన్నారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించారు.

నిర్ణయాలు ఘనం.. అమలు మందగమనం

ఒక్కటీ సరిగా అమలుకాని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు • ఉపసంఘం పేరుతో కాలయాపన

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రిమండలి ఒక నిర్ణయం తీసుకున్నదంటే కచ్చితంగా అమలవుతుందని ప్రజలు నమ్ముతుంటారు. అయితే రాష్ట్ర క్యాబినెట్ ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల్లో కొన్ని అమలు కావటం లేదు. సమావేశం తర్వాత ఫలానా నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్నా.. అమల్లో మాత్రం మందగమనం కనిపిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించి, వేగంగా పూర్తిచేసే వ్యవస్థ లేకపోవటమే ఇందుకు కారణమని అంటున్నారు. కీలక నిర్ణయాలపై మంత్రివర్గ ఉపసంఘం వేసి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మార్చి 12న జరిగిన క్యాబినెట్ సమావేశంలో.. 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. గ్రామ సభలు పెట్టి దరఖాస్తులపై చర్చించి, జాబితా రూపొందిస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క ఇల్లుకు కూడా నిధులు విడుదల కాలేదు. మహిళా సంఘాల బ్రాండింగ్ కోసం ఓఆర్ఆర్ చుట్టూ 30 ఎకరాల స్థలం కేటాయించాలని నిర్ణయించినా ఇప్పటివరకు అమలు కాలేదు. డీఎస్సీ 2008 బాధితులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. విధివిధానాల ఖరారును సబ్ కమిటీకి అప్పగించారు. అయితే ఇప్పటివరకు పూర్తి కాలేదు.

జూన్ 21న జరిగిన క్యాబినెట్ సమావేశంలో అందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.31 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. కానీ.. ఇప్పటికీ పూర్తికాలేదు. రూ.18 వేల కోట్లతో రుణమాఫీ చేశామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంటే ఇంకా రూ.13 వేల కోట్ల రుణమాఫీ కాలేదని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కమిటీ జూలై 15లోగా ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని, అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ జరుపుతామని చెప్పారు. కానీ.. నివేదిక అందలేదు. అసెంబ్లీలో చర్చించలేదు.

ఆగస్టు 1న జరిగిన క్యాబినెట్ సమావేశంలో.. కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించిన విదివిధానాల రూపకల్పన బాధ్యతలను సబ్ కమిటీకి అప్పగించారు. రేషన్‌కార్డులకు కొత్తగా అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సీఎం గురువారం ఆదేశించగా, ఆరోగ్యశ్రీ కార్డులపై స్పష్టత రాలేదు. క్రీడాకారులు నిఖత్ జరీన్, సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తామని నిర్ణయించగా, సిరాజ్‌కు ఇప్పటివరకు ఉద్యోగం ఇవ్వలేదు. విధి నిర్వహణలో మరణించిన ఇంటెలిజెన్స్ డీజీ రాజీవ్‌రతన్ కుమారుడు హరిరతన్‌కు మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినా అమల్లోకి రాలేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు చేపడుతామని చెప్పినా ఆచరణలోకి రాలేదు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని, ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిన ఉద్యోగాలకు సంబంధించి అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి అయినా అమలు చేస్తామని మీడియా ముందు చెప్పారు. కానీ ఇప్పటికీ ఆర్డినెన్స్ తేలేదు.

సీఎం సహాయనిధికి ఒకరోజు మూలవేతనం

ఆయా విభాగాలకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): సీఎం సహాయ నిధికి ఉద్యోగుల ఒకరోజు మూలవేతనాన్ని విరాళంగా జమచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఆదేశాలు జారీచేశారు. సెప్టెంబర్ వేతనాల్లోంచి ఒకరోజు మూలవేతనం కుదింపు ద్వారా సీఎం సహాయనిధికి ఇవ్వాలని పేర్కొన్నారు.

సింగరేణి 10.25 కోట్ల విరాళం

వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి సింగరేణి రూ. 10.25 కోట్ల విరాళాన్ని ఇచ్చింది. గురువారం ఇందుకు సంబంధించిన చెక్కును సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో సింగరేణి సీఎండీ బలరాం, ఎనర్జీ సెక్రటరీ రొనాల్డ్ రాస్ అందజేశారు. సింగరేణి కాలరీస్ అధికారులు, ఉద్యోగుల ఒక్కరోజు బేసిక్ వేతనాన్ని అందించారు. సీపీఐ నేత కొత్తగూడెం ఎమ్మెల్యే రూ. 2.50 లక్షల విరాళం చెక్కును సీఎం రేవంత్‌కు అందించారు.

ఆ కేసును కొట్టేయండి

డిప్యూటీ కమిషనర్ నందగిరి సుధాంశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : హైడ్రా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని చందానగర్ సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నందగిరి సుధాంశ్ హైకోర్టులో గురువారం పిటిషన్ వేశారు. శేరిలింగంపల్లి మండలం మదీనగూడలోని ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు అనుమతులివ్వడం, వాటిని అడ్డుకోవడంలో విఫలమైన అధికారులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు మున్సిపల్ అధికారులకు లేఖ రాసినా చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనల మేరకు విధులు నిర్వహించానని, తనపై నమోదు చేసిన కేసు చట్ట వ్యతిరేకమని, అందులోని అభియోగాలు నిరాధారమని, వాటిని కొట్టివేయాలని సుధాంశ్ కోరారు.

3 రోజులు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రక్రియ ప్రారంభమైందని, వీటి ప్రభావంతో ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో 24న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఈ రుతుపవనాల తిరోగమనంలోనూ భారీ వర్షాలకు అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు.

'స్త్రీనిధి' ఎండీపై విచారణ కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్త్రీ నిధి సహకార సమాఖ్య ఎండీ విద్యాసాగర్‌రెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం కమిటీ వేసింది. ఐఏఎస్ అనితారామచంద్రన్, సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, ఆర్థిక శాఖ ఉప కార్యదర్శి చంద్రకళ, ఐటీ శాఖ ఎంజీఎం శ్రీనివాస్‌ను సభ్యులుగా చేర్చింది. స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నారు.

ఎన్నికల కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గవర్నర్‌ను కలిసిన రాణి కుముదిని

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రాణి కుముదిని బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈసీ కార్యదర్శి అశోక్ కుమార్, ఇతర అధికారులు ఆమెను అభినందించి స్థానిక సంస్థల ఓటరు జాబితా షెడ్యూల్ వివరించారు. అనంతరం ఆమె రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. మూడేండ్ల పాటు ఆమె బాధ్యతల్లో కొనసాగనున్నారు.

15 ఏండ్లు దాటిన వాహనాలు తుక్కుకే

జనవరి 1 నుంచే అమల్లోకి!

హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ) : జనవరి 1 నుంచి కాలుష్య కారక వాహనాల రద్దుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. దీని అమలు ప్రకారం ఏదైనా వెహికిల్ 15ఏండ్లు దాటితే రోడ్డుపై తిరగడానికి వీలు ఉండదు. ఒకవేళ వాహనం కండీషన్‌లో ఉంటే ప్రభుత్వం నిర్వహించే ఫిట్‌నెస్ టెస్టులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. లేకుంటే వాటిని రోడ్లపైకి అనుమతించరు. త్వరలోనే ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్టు సమాచారం. 15 ఏండ్లకు పైబడిన వాహనాలకు ఫిట్‌నెస్ లేనట్లు తేలితే యజమానులు వాహనాన్ని స్క్రాప్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రాఫిక్ నియమాల మేరకు ఫైన్ లేదా వాహనాన్ని సీజ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే టెస్టులో ఫిట్‌నెస్ ఉన్నట్టు గుర్తించిన వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ చెల్లించి అదనంగా 3-5 ఏండ్ల పాటు కొనసాగించవచ్చు. రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ వెహికిల్ స్క్రాపేజ్ పాలసీ ముసాయిదా బిల్లును రూపొందించి ఆమోదం కోసం ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది.

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.



హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో-ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుటిలెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2-3మూడేండ్లలో మరో 3-4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య



టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంకర్‌ప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంకర్‌ప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండికొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కస్సలైంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర